జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 54 ‖ మంగళవారం ‖ 21-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

21 జూలై 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి అష్టమి తె. 5:17o వరకు తరువాత నవమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం చిత్తా రా. 8:47 వరకు తరువాత స్వాతి యోగం సిద్ధ సా. 6:21 వరకు కరణం విష్టి సా. 4:39 వరకు బవ తె. 5:17o వరకు వర్జ్యం రా. 2:56 నుండి తె. 4:41 వరకు దుర్ముహూర్తం ఉ. 8:30 నుండి ఉ. 9:22 వరకు రా. 11:16 నుండి రా. 12:00 వరకు రాహుకాలం మ. 3:35 నుండి సా. 5:12 వరకు యమగండం ఉ. 9:09 నుండి ఉ. 10:45 వరకు గుళికాకాలం మ. 12:22 నుండి మ. 1:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు మ. 1:58 నుండి మ. 3:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున



## రాయితీలు కాదు.. రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

**వట్టే జానయ్య యాదవ్**

ఇకపై రాయితీలు, పథకాలు, సహకారాల కోసం ఎదురు చూడకుండా పూర్తి స్థాయిలో రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్, మనదీపం జూలై 20: హైదరాబాద్‌లో కటకం నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన “మన ఆలోచన వేదిక” కార్యక్రమంలో, అలాగే అన్ని కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ఓటు హక్కును బహుజన (మిగతా 2వ పేజీలో)



# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు స్థిర ఆదాయం

## కొణిజర్లలో రూ.300 కోట్ల పరిశ్రమ ప్రారంభం



- రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై పిలుపు
- కొణిజర్ల నుంచే విత్తనాల ఉత్పత్తి లక్ష్యం
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఊతం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఆయిల్‌పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే వాణిజ్య పంటగా మారిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రైతులు అధిక ఆదాయం వచ్చే పంటల సాగు వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఖమ్మం, జూలై 21: నాగార్జునసాగర్ ఎడమ కాలువ, పాలేరు, వైరా జలాశయాల ద్వారా సాగునీరు అందుతున్నప్పటికీ రైతుల ఆదాయాన్ని మరింత పెంచే పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగు రైతులకు మంచి అవకాశంగా నిలుస్తుందని చెప్పారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, కరవు వంటి పరిస్థితుల్లో కూడా ఆయిల్‌పామ్ రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.45 వేల వరకు సబ్సిడీ (మిగతా 2వ పేజీలో)



# ఢిల్లీలో నిరసనలపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

**నీట్ వ్యవహారంపై కేంద్రం జవాబుదారీతనంవహించాలని డిమాండ్**

**విద్యార్థులకు అండగా ఉంటానని ముఖ్యమంత్రి హామీ**

నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు తీసుకున్న చర్యలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

హైదరాబాద్, జూలై 21: శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దురదృష్ట కరమని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభు త్వం వినాలని ఆయన సూచించారు. సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన ముఖ్యమం త్రి, విద్యార్థుల భవిష్యత్తుతో ముడి పడిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని అన్నారు. విద్యార్థుల గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ నిజాన్ని చూసే భయానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నీట్ పరీక్ష వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి జవాబుదారీతనం వహించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్షల (మిగతా 2వ పేజీలో)

# రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

**కరువు పరిస్థితులపై స్పందన.. సాగునీటి నిర్వహణపై ప్రశ్నలు**

**పంప్ హౌస్‌ల వినియోగంపై వ్యాఖ్యలు.. ప్రభుత్వ తీరును తప్పుబట్టిన కేటీఆర్**




హైదరాబాద్, జూలై 21 :తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితు లు, సాగునీటి నిర్వహణ అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. కరువును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పంప్ హౌస్‌లను సక్రమంగా వినియోగించడం లేదని అన్నారు. కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, పంపులను ప్రారంభించడంలో నిర్లక్ష్యం (మిగతా 2వ పేజీలో)



# బాధితురాలికి న్యాయం చేయాలి

**ఆస్పత్రిలో హరీశ్‌రావు పరామర్శ.. త్వరిత చర్యలకు విజ్ఞప్తి**

హైదరాబాద్, జూలై 21: ఖమ్మం జిల్లాలో బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బాధితురాలి పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఆలస్యంగా , (మిగతా 2వ పేజీలో)




# లక్ష ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- మొదటి విడతలో లక్ష ఇళ్ల మంజూరు
- మంత్రుల సమక్షంలో ప్రారంభం
- ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం
- మహిళల పేరిట ఇళ్ల పట్టాలు

హైదరాబాద్, జూలై 21:హైదరాబాద్ నగర పరిధిలో ఇల్లు లేని పేద కుటుంబాలకు మొదటి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం శ్రీకారం చుట్టింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, (మిగతా 2వ పేజీలో)



# ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు

**మంత్రి కొండపల్లితో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన హోం మినిస్టర్**

ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి విచ్చేస్తున్న గౌరవ ప్రధాని నరేంద్ర మోడి పర్యటనకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, హోంశాఖామాత్యులు వంగలపూడి అనిత అధికార యత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి, ఆమె సోమవారం ఎయిర్‌పోర్టును సందర్శించారు.

విజయనగరం, జులై 20: ప్రధాని పర్యటనా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్, ఇతర అధికారులతో ఎయిర్‌పోర్టు సమావేశ మందిరంలో సమీక్షించారు. పర్యటనకు చేస్తున్న ఏర్పాట్లపై అంశాలవారీగా మంత్రి చర్చించారు. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి భారీ ఎత్తున జనం, విఐపిలు, వివిఐపిలు తరలివస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలలో స్థిరమైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ విషయంలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి కొంత వరకు అనుకూలిస్తుంది. నిరుద్యోగులకు కష్టానికి తగిన అవకాశాలు లభిస్తాయి.

వృషభం: వృధా ప్రయాణాలు చేస్తారు. ఇంటా బయటా ప్రతికూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో వివాదాలు కలుగుతాయి. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగమున ఇతరులతో మాట పడవలసి వస్తుంది. నిరుద్యోగులకు మిశ్రమ ఫలితాలుంటాయి.

మిధునం: దూరప్రాంత బంధువులతో శుభకార్యములకు హాజరవుతారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన లాభాలు పొందుతారు. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగస్తులకు హోదాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది.

కర్కాటకం: కీలక వ్యవహారాల్లో ఆలోచించి ముందుకు సాగడం మంచిది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తప్పవు. బంధు మిత్రులతో ఏర్పడిన వివాదాల పరిష్కారానికి ఆటంకాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వాహన ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహారించాలి.

సింహం: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు నూతన బాధ్యతలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తిగా ఉంటుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉ పశమనం కలుగుతుంది.

కన్య: ఉద్యోగ విషయంలో అధికారుల నుండి సానుకూలత పెరుగుతుంది. ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న అవసరానికి ధనం అందుతుంది.

తుల: ఆర్థిక వృద్ధి కలుగుతుంది. కీలక వ్యవహారాల్లో జీవితభాగస్వామి సలహా తీసుకోవడం మంచిది. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉండదు. వృత్తి ఉ ద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. దైవ కార్యక్రమాలపై ఆసక్తి కలుగుతుంది. నిరుద్యోగుల కష్టం వృధాగా మిగులుతుంది. నూతన ఋణాలు చెయ్యకపోవడం మంచిది.

ధనస్సు: చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. సోదరులతో భూ సంబంధిత వివాదాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

మకరం: కీలక వ్యవహారాలలో విజయం సాదిస్తారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంటారు. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. వృత్తి ఉ ద్యోగాలలో అరుదైన అవకాశాలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేస్తారు. వృధా ఖర్చులను అదుపు చేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండాలి. ఉద్యోగాలలో స్వల్ప ఇబ్బందులు తప్పవు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

మీనం: వృత్తి ఉద్యోగాలలో పనిభారం నుండి కొంత ఉ పశమనం లభిస్తుంది. ఇంటా బయట అనుకూలత పెరుగుతుంది. సన్నిహితుల నుండి అరుదైన శు భాకార్య ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు భవిష్యత్తుకు ఉ పయోగపడతాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభిస్తాయి.






# రాయితీలు కాదు.. రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సమాజం ఇప్పటికీ సమర్థవంతంగా వినియో గించుకోలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బోధించిన "మన ఓటు మనకోసం" అనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గత 75 ఏళ్లలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, మానసిక బానిసత్వం నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేకపోయామని ఆయన పేర్కొన్నారు. జనాభాలోనూ, ఓట్లలోనూ మెజారిటీగా ఉన్న సబ్బండ కులాలు తమ ఓట్లను ఐక్యంగా వినియోగిస్తే రాజ్యాధికారం సాధించడం సాధ్యమేనని స్పష్టం చేశారు. మన పోరాటం రాజ్యాధికారమే కావాలి... రాయితీలు మాకొద్దు అనే నినాదాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు (మిగతా 2వ పేజీలో)ఎన్నో బీసీ సంఘాలు ఏర్పడినా, తమ రాజ కీయ శక్తిని సమీకరించి శాసనసభకు తగిన ప్రాతినిధ్యం కల్పించుకోలేకపోవడం బాధాకర మన్నారు. ఇకపై కేవలం సామాజిక చైతన్యం గురించి మాత్రమే మాట్లాడే పరిస్థితి దాటిపో యిందని, రాజ్యాధికారం సాధించే దిశగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. ప్రజ లు మార్పుకు సిద్ధంగా ఉ న్నారని, అయితే నాయకత్వం ఆ అవకాశాన్ని అందిపుచ్చుకో వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సబ్బండ కులాలన్నీ ఐక్యంగా ముందుకు వచ్చి రాజకీయ అధికారాన్ని సాధించేందుకు ఉద్యమాన్ని వేగవంతం చేయాలని వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, నరసింహారావు నీరజ గౌడ్, వెంకన్న , భిక్షపతి తదితర కుల సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.





# లక్ష ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌తో పాటు హైదరాబాద్ పరిధిలోని 16 నియోజ కవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నా రు. పేదలకు గృహ భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా హైదరాబాద్ వంటి మహానగరంలో ప్రభుత్వ భూములపై పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చారిత్రక నిర్ణయమని తెలిపారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు దశలవారీగా ఇళ్లను అందజేసే ప్రక్రియను పారదర్శకంగా అమలు చేస్తామని వెల్లడించారు. హైదరాబా ద్ నగరాభివృద్ధి పరిధిలోని ఇల్లు లేని పేదల కు మొదటి విడతగా లక్ష ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున అల్పా దాయ వర్గాల కుటుంబాలకు ఇళ్లు కేటాయిం చనున్నట్లు తెలిపారు. ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ప్రభుత్వ భూము ల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టి వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని, ఎలాంటి సిఫార్సులు లేదా పైరవీలకు అవకాశం ఉండదని మంత్రులు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర వివరాలతో రూపొందించిన సమాచార పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రతి అర్హ కుటుంబానికి పారదర్శకంగా ఇళ్లు అందేలా ప్రత్యేక వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ ఇంటి పట్టాలను మహిళల పేరిటే జారీ చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల మహిళలకు సొంతింటిపై హక్కు కలగడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ఈ నిర్ణయం కీలకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పేరు సూచిస్తూ నిర్వహించిన సామాజిక మాధ్యమాల పోటీలో విజేతగా నిలిచిన నల్గొండ జిల్లాకు చెందిన కొండా నాగరాజుకు రూ.1 లక్ష నగదు ప్రోత్సాహకాన్ని మంత్రులు సంయుక్తంగా అందజేశారు. రాష్ట్రంలో ఇప్పటికే తొలి విడతగా మంజూరైన 4.50 లక్షల ఇళ్లతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్ల మంజూరుతో మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కార్యక్రమంలో వెల్లడించారు.

# ఢిల్లీలో నిరసనలపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత అత్యంత కీలకమని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దీనిపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజున విద్యార్థులు నిర్వహించిన "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువు ప్రయోగించినట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు స్పందిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని, పరీక్షల వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం పెంపొందేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలు కూడా ఉండకూడదని మంత్రులు స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు ఎక్కడా ఇబ్బంది రాకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని మంత్రులు సూచించారు.



గిరిజన సంప్రదాయ కళల ప్రదర్శన, అరకు నుంచి విద్యార్థులను తీసుకువచ్చే అంశంపై చర్చించారు. ఉత్తరాంధ్ర ముఖ చిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని, ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని మంత్రులు కోరారు. అంతకుముందు మంత్రులిద్దరూ అధికారులతో కలిసి ప్రధాని పర్యటించే ప్రాంతం, టెర్మినల్ భవనం, బహిరంగ సభా స్థలం, పార్కింగ్, అప్రోచ్ రోడ్లు, అల్లూరి ఐలాండ్, ట్రంపెట్ బ్రిడ్జి నిర్మాణం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీటికి సంబంధించిన మ్యాపులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో నెల్లిమర్ల ఎంఎల్ఏ లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, జిసిసి ఎండి ఎస్ ఎస్ శోభిక, ఐఏఎస్ అధికారి అభిషేక్, ట్రైనీ ఐఏఎస్ హరి ఓం పాండ్యా, జిల్లా అధికారులు, జిఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు స్థిర ఆదాయం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దీర్ఘకాలిక లాభాలు పొందాలని సూచించారు. దేశానికి ప్రతి సంవత్సరం సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పామాయిల్ అవసరమవుతుండగా, దేశీయ ఉత్పత్తి సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందని భట్టి విక్రమార్క చెప్పారు. దీంతో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, దేశంలోనే ఉత్పత్తి పెరిగితే విదేశీ మారక ద్రవ్యం ఆదా కావడంతో పాటు రైతులకు కూడా భారీ ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. దేశంలో సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం కేవలం 15 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతోందని వివరించారు. కొణిజర్లలో ఏర్పాటు చేసిన సమీకృత పరిశ్రమ ద్వారా పరిశోధన, విత్తనాల అభివృద్ధి, నర్సరీలు, విత్తన తోటలు, మిల్లింగ్, శుద్ధి కేంద్రాలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇప్పటి వరకు మలేసియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఆయిల్‌పామ్ విత్తనాల స్థానంలో భవిష్యత్తులో కొణిజర్ల నుంచే దేశవ్యాప్తంగా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసే స్థాయికి ఈ కేంద్రం ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పరిశ్రమతో ఖమ్మం జిల్లాలో వ్యవసాయ ఆధారిత అనుబంధ పరిశ్రమలు ఏర్పడి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమకు అవసరమైన రహదారి సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

శ్వేత

# సంపాదకీయం

మంగళవారం 21-7-2026

## ప్రజాగొంతుకపై అంకుశం!

దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఏకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటానికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు.

వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభిం అయినా, ఎన్‌డిఏ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు.

ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.




## వైభవంగా 'షైనింగ్ స్టార్స్--2026' అవార్డుల ప్రదానం!

**224మంది విద్యార్థులకు రూ.44.80 లక్షల ప్రోత్సాహకాలు పంపిణీ**

**విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసా పత్రం అందజేత**

**విద్యా సంస్కరణలతో పెరిగిన విద్యా ప్రమాణాలు: ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు**

**పోటీతత్వం, ఆసక్తి పెంచడానికే ప్రభుత్వ ప్రోత్సాహకాలు: కలెక్టర్ కృతికా శుక్లా**





నరసరావుపేట, జూలై 20: పల్నాడు జిల్లాలో 2025--26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరించేందుకు ఉద్దేశించిన "షైనింగ్ స్టార్స్--2026" అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్లో సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు అధ్యక్షత వహించిన ఈ ప్రతిభా పురస్కారాల మహోత్సవంలో పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఐఏఎస్, ప్రభుత్వ విప్ జి.వి. ఆంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 186 మంది పదవ తరగతి విద్యార్థులకు, 38 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు కలిపి మొత్తం 224 మందికి "షైనింగ్ స్టార్స్-2026" అవార్డులను ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా అందజేశారు. ప్రతి అవార్డు గ్రహీతకు రూ.20 వేలు నగదు బహుమతి చెక్కుతో పాటు, జ్ఞాపిక పతకం (మెడల్), ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. మొత్తం రూ.44.80 లక్షల ప్రోత్సాహక నగదును విద్యార్థుల ఉన్నత చదువుల నిమిత్తం పంపిణీ చేశారు.

### పి-4 విధానం మరియు వినూత్న విద్యా సంస్కరణలు

ఈ సందర్భంగా సభాధ్యక్షత వహించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అద్భుత నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విప్లవాత్మక విద్యా సంస్కరణలు అమలవుతున్నాయని, ఇవి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. గత రెండు సంవత్సరాలుగా సర్కారు బడులలో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. పి-4 విధానం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్లు, నాణ్యమైన ఫర్నిచర్, ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు, రక్షణ కోసం ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదులు, పాఠ్యపుస్తకాలు వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నట్లు వివరించారు. నాణ్యమైన బోధన, మౌలిక వసతుల కల్పన వల్ల ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం ద్విగుణీకృతమైందని, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించే స్థాయికి ఎదుగుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు వారి కఠోర శ్రమతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు.

### పోటీతత్వాన్ని పెంచే ప్రోత్సాహకాలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించడానికి, వారిలో ఉన్నత విద్యపై మరింత ఆసక్తిని కలిగించడానికి ప్రభుత్వం ఇలాంటి ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. విద్యే సమాజాభివృద్ధికి మూలస్తంభమని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఏడాది అవార్డుల ఎంపిక విధానం అత్యంత పారదర్శకంగా జరిగిందని అధికారులు తెలిపారు. పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను మండలాల వారీగా, అన్ని సామాజిక వర్గాల వారీగా ఎంపిక చేయగా, ఇంటర్మీడియట్‌లోనూ అన్ని గ్రూపులకు చెందిన ఉత్తమ ప్రతిభావంతులను సత్కరించారు. పదవ తరగతి అవార్డు గ్రహీతల్లో ప్రభుత్వ పాఠశాలల నుండి 81 మంది (38 మంది బాలురు, 43 మంది బాలికలు), ప్రైవేట్ పాఠశాలల నుండి 105 మంది (30 మంది బాలురు, 75 మంది బాలికలు) ఉన్నారు. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల నుండి 9 మంది, ప్రైవేట్ కాలేజీల నుండి 29 మంది పురస్కారాలు అందుకున్నారు. ఈ ఏడాది ఎస్ఎస్‌సీ ఫలితాల్లో పల్నాడు జిల్లా 87.5 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 12వ స్థానం, ఇంటర్మీడియట్‌లో 77 శాతం ఉత్తీర్ణతతో 14వ స్థానం సాధించడం జిల్లా విద్యాశాఖ ప్రగతికి నిదర్శనమన్నారు.

కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, రాష్ట్ర శిల్పకళా సంస్థ చైర్మన్ మంజుల రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గంగాధర్,జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె. రామారావు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## 106 మంది విద్యార్థులకు రూ.14.24 లక్షల ఉపకార వేతనాలు

**కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం**

సత్తెనపల్లి, జూలై 20: కాకతీయ కళ్యాణ మండపంలో సోమవారం కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, మాజీ మేయర్ కన్నా నాగరాజు, ఆర్డీవో గోపాలకృష్ణలు పాల్గొని ప్రతిభ కనబరిచిన 106 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.14.24 లక్షల విలువైన ఉపకార వేతనాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. కార్పొరేట్ చదువులే శ్రేష్ఠమనే భావన వీడి, తల్లిదండ్రులు కనీసం హైస్కూల్ వరకైనా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాజ సేవలో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. 2013 నుంచి నిరంతరాయంగా ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఆసుపత్రులకు మౌలిక వసతులు, నిరుపేదలకు సహాయం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నామని చెప్పారు.

గతంలో గుంటూరులో జరిగే ఈ కార్యక్రమాన్ని గత నాలుగేళ్లుగా సత్తెనపల్లిలోనే నిర్వహిస్తున్నామని, ప్రజల సహకారంతో భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# నేటి విజేతలు.. రేపటి దేశ భవిష్యత్తు!

**పదో తరగతి, ఇంటర్ ప్రతిభావంతులకు 'సైనింగ్ స్టార్స్' పురస్కారాలు**

**ఫలితాల్లో 5వ స్థానానికి శ్రీకాకుళం జిల్లా**

**రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

శ్రీకాకుళం, జూలై 20: నేటి విజేతలు.. రేపటి దేశ భవిష్యత్తు!" అని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం శ్రీకాకుళం నగరంలోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం 'ఫెలిసిటేటింగ్ షైనింగ్ స్టార్స్-2026' పురస్కారాల ప్రదానోత్సవ వేడుక ఘనంగా జరిగింది. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సభాధ్యక్షత వహించిన ఈ వేడుకలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది జిల్లా విద్యార్థుల ఉత్తీర్ణత శాతంలో గణనీయమైన మార్పు వచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో 82.41 శాతంగా ఉన్న జిల్లా ఉత్తీర్ణత, ఈ ఏడాది ఏకంగా 90.60 శాతానికి పెరిగిందన్నారు. విద్యా ఫలితాల్లో గతంలో రాష్ట్రంలో 14వ స్థానంలో ఉన్న శ్రీకాకుళం జిల్లా, నేడు 5వ స్థానానికి చేరుకోవడం మన విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉత్తీర్ణత గతంలోని 78.29 శాతం నుండి 88.07 శాతానికి అంటే దాదాపు 10 శాతం పెరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల నుండి 'సైనింగ్ స్టార్స్' పురస్కారాలు సాధించిన విద్యార్థుల సంఖ్య 88 నుండి 106 కి పెరిగిందని, ఈసారి అవార్డులు సాధించిన వారిలో 66 శాతం మంది బాలికలే ఉండటం విశేషమని మంత్రి కొనియాడారు.

రాష్ట్ర యువతకు చదువుతో పాటు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అనేక పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని మంత్రి వివరించారు. దేశంలో వస్తున్న మొత్తం పారిశ్రామిక పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయన్నారు. యువతకు రాబోయే రోజుల్లో 20 లక్షల ఉద్యోగాలను అందించాలనే లక్ష్యంతో సుమారు ఆరుగురు మంత్రులతో కూడిన ప్రత్యేక 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. మన యువతకు అంతర్జాతీయంగా మరిన్ని అవకాశాలు కల్పించేలా రష్యా వంటి దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక శిక్షణ, మద్దతు అందిస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీన గౌరవ ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రంలో రాబోయే ప్రాజెక్టులకు సంబంధించి కీలక పరిణామాలు జరగనున్నాయని మంత్రి వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు, విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. మన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మంచి విషయాలను, సాధిస్తున్న అద్భుత విజయాలను జూనియర్ విద్యార్థులకు కూడా వివరించి వారిలో స్ఫూర్తి నింపాల్సిన బాధ్యత సీనియర్ విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు వారి విద్యా ప్రగతిని తల్లిదండ్రులకు వివరించేందుకు ఈ నెల జూలై 24న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోయే 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్' ను జిల్లావ్యాప్తంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదిగేలా పాఠశాలల్లో క్రమశిక్షణను నేర్పుతున్నామని సభాధ్యక్షత వహించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోడీ సారథ్యంలో 'వికసిత్ భారత్ 2047' సాధించడమే నేటి విద్యార్థుల లక్ష్యం కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' సాధనే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలపగా, విద్యార్థులు ఉన్నతమైన కలలు కనాలని, వాటిని సాధించే వరకు నిరంతరం కష్టపడాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల ప్రత్యేక బోధన, అధికారుల నిరంతర పర్యవేక్షణ వల్లే తాము ఈ అద్భుత ఫలితాలు సాధించగలిగామని సత్కారం పొందిన విద్యార్థులు సింహాద్రి హాసిని, శృతి, గోవిందరాజు, యామినిలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ విఠల్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మొదలవలస రమేష్, పీఎంజే బాబు, అధికారులు పాల్గొన్నారు.



## ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా కుటుంబ నియంత్రణ లబ్ధిదారులకు లక్కీడ్రా

**విజేతలకు ఒక్కొక్కరికి రూ.5,000 నగదు ప్రోత్సాహకం**

**జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ**

విజయవాడ: జూలై 20: ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరం నందు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక లక్కీ డ్రా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ అనేది కేవలం జనాభా నియంత్రణకే పరిమితం కాకుండా తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ ఆర్థికాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు ఎంతో కీలకమని అన్నారు. శాశ్వత కుటుంబ నియంత్రణతో పాటు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన పిపిఐయుసిడి, అంతరా ఇంజెక్షన్ వంటి ఆధునిక పద్ధతులను ప్రజలు విస్తృతంగా వినియోగించాలని సూచించారు. అర్హులైన దంపతులు ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుబాటులో ఉన్న కుటుంబ నియంత్రణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జూలై 11, 2026న ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న అర్హులైన దంపతులు, ప్రసవానంతరం పిపిఐయుసిడి వేయించుకున్న లబ్ధిదారులు, అంతరా ఇంజెక్షన్ వినియోగించిన మహిళలలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రజల్లో ప్రోత్సహించడంతో పాటు, చిన్న కుటుంబం -- సంతోషకరమైన కుటుంబం అనే భావనను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న దంపతులలోలి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న లబ్ధిదారుల విభాగంలో విజేతలుగా రాణిగారి తోట యుపిహెచ్సి పరిధిలోని తమ్మిశెట్టి మల్లేశ్వరి, గిరిపురం యుపిహెచ్సి పరిధిలోని షేక్ నజియా, విజయవాడ రూరల్ పరిధిలోని భవారి అంజలి విజేతలుగా నిలిచారు. లిపిపిఐయుసిడి వేయించుకున్న లబ్ధిదారుల విభాగంలోలి సింగ్ నగర్ పరిధిలోని కె.తేజావతి, క్రీస్తురాజపురంకి చెందిన డి.మరియమ్మ విజేతలుగా నిలిచారు. అంతరా ఇంజెక్షన్ వినియోగించిన లబ్ధిదారుల విభాగంలోలి ఇబ్రహీంపట్నం పరిధికి చెందిన జి.సాగర రాణి, కొండూరు పరిధికి చెందిన కె.నరసమ్మ విజేతలుగా నిలిచారు. చివరిగా కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమాచారం గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.శ్రావణబాబు, ఎన్టీఆర్ వైద్య సేవా కార్యక్రమ జిల్లా అధికారి డా. సుమన్, జిల్లా గణాంక అధికారి, వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు


**సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక ఆధార్ సేవా శిబిరాలు అందుబాటులో ఉంటాయని.. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎంపిక చేసిన స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ శిబిరాలు సేవలందిస్తాయన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్‌లో పేరు, చిరునామా, జనన తేదీ, మొబైల్ నంబరు, బయోమెట్రిక్ వివరాల నవీకరణతో పాటు 5 నుంచి 15 ఏళ్లు, ఆ పైబడిన చిన్నారుల బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను పొందొచ్చన్నారు. ప్రజలకు సకాలంలో పారదర్శకంగా ఆధార్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా విద్యార్థులకు ఆధార్ సేవలు తేలిగ్గా అందుబాటులో ఉండేలా పాఠశాలలు,

కళాశాలల్లోనూ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.




## తెలుగు భాష, సంస్కృతి వైభవానికి రెండు ప్రతిష్టాత్మక ఉత్సవాలు

**జూలై 25--26న 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం' -- ఆగస్టు 8--9న 'అమరావతి చిత్రకళా వీధి'**

**కళాకారులు, రచయితలు, ప్రజలందరూ భాగస్వాములు కావాలి**

**లిరాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి**

రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పునర్వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు.

విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, నృత్య సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జూలై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం' ను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో 'సూర్యోదయ సుప్రభాతం' సంగీత కార్యక్రమం, 'ఆమె మాట -- అక్షర బాట', కవి




సమ్మేళనాలు, 'అమ్మమ్మ కథల ముచ్చట్లు', 'నెక్స్ట్ జెన్ తెలుగు' యువతతో చర్చలు, 'నవస్వరం' ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆగస్టు 8, 9 తేదీలలో గుంటూరు విద్యానగర్ రింగ్ రోడ్డులో 'అమరావతి చిత్రకళా వీధి' పేరుతో ఓపెన్ ఎయిర్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది రాజమండ్రిలో 550 మంది కళాకారులతో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి 800 స్టాల్స్‌తో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు స్వరాష్ట్రంలోనే విశాల వేదిక కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు తేజస్వి పొడపాటి పేర్కొన్నారు.

జూలై 26 సాయంత్రం జరిగే తెలుగు మహోత్సవం ముగింపు సభకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ నిర్వహణలో జరిగేవి మాత్రమే కాకుండా, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు, యువత, ప్రజలందరూ భాగస్వాములై తెలుగు సంస్కృతి పరిరక్షణకు తోడ్పడాలని తేజస్వి పొడపాటి పిలుపునిచ్చారు.

## పెండెం జగదీశ్వర్ సాహిత్య సేవ చిరస్మరణీయం

బాల సాహితీరత్న పెండెం జగదీశ్వర్ తెలుగు బాల సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన నిర్వహించిన పెండెం జగదీశ్వర్ స్మారక ఏడవ జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, తెలుగు బాల సాహిత్యంలో పెండెం జగదీశ్వర్ అనేక వినూత్న ప్రయోగాలు చేశారని కొనియాడారు. ముఖ్యంగా తెలంగాణ భాషలో పిల్లల కోసం కథలు రచించిన తొలి రచయితగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి పెండెం జగదీశ్వర్ బాల సాహిత్య పురస్కారాన్ని నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు విభాగం సహసంపాదకులు, ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్‌కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.5,000 నగదు, సన్మాన పత్రం, శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ, పెండెం జగదీశ్వర్ పేరిట పురస్కారం అందుకోవడం ఆనందదాయకమని, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి, మునాస్ వెంకట్, డాక్టర్ పగడాల నాగేందర్, కుకుడాల గోవర్ధన్, మాదగాని శంకరయ్య, పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పెందోట సోము, డాక్టర్ ఉప్పల పద్మ, ఎడ్ల సైదులు, ముక్కామల జానకిరామ్, దాసరి శ్రీరాములు, బండారు శంకర్, బాసరాజు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు

# ప్రజలకు భరోసాగా నిలవాలి

**పరిష్కరించిన ఫిర్యాదు తిరిగి పునరావృతం కాకూడదు**

**ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవు**

**సత్వర, నాణ్యమైన పరిష్కారమే ప్రజల సంతృప్తికి కొలమానం: డా.లక్ష్మీశ**

విజయవాడ: జూలై 20: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ ఆదేశించారు.

జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో పెండింగ్, పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ ఒకసారి పరిష్కారం చూపిన ఫిర్యాదు తిరిగి ప్రారంభమయ్యే పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం కేవలం నామమాత్రంగా కాకుండా ఫిర్యాదుదారుడు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా ఉండాలన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించలేని పరిస్థితుల్లో కారణాలను స్పష్టంగా వివరించి అర్జీదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అర్జీని పూర్తిగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో తమ సమస్యలను తీసుకొస్తున్నందున వాటిని తమ సమస్యలుగా భావించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ సమావేశం ద్వారా 251 అర్జీలను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

పీజీఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయం

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యూ.ఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ డా.లక్ష్మీశ తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాలు, హెల్ప్‌డెస్కులు, ఫిర్యాదుల కౌంటర్లు, నోటీసు బోర్డులు తదితర ప్రదేశాల్లో క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. ఈ విధానం ద్వారా ప్రజల సంతృప్తి స్థాయిని అంచనా వేసి సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహ, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటం నుంచి పార్లమెంటరీ రాజకీయాల వైపు... అదే విజయానికి కీలకం

కొలంబో, జూలై 19

శ్రీలంకలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ, ఆర్థిక పరిణామాల అధ్యయనంలో భాగంగా తెలంగాణకు చెందిన ప్రతినిధి బృందం ఆదివారం కొలంబోలోని శ్రీలంక సెక్రటేరియట్‌లో శ్రీలంక సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ హిందుమా సునిల్ సెన్విని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలోని జనతా విముక్తి పెరమున (జేవీపీ) ఆవిర్భావం నుంచి దేశంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను వివరించారు. ప్రారంభ దశలో సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించిన జేవీపీ, 1994లో ఆ మార్గాన్ని పూర్తిగా వీడి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎంచుకుందని తెలిపారు. అదే పార్టీ విజయానికి, ప్రజల విశ్వాసాన్ని చూరగొనడానికి కీలక మలుపుగా నిలిచిందన్నారు.



పార్లమెంటరీ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు సాగిస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసినట్లు మంత్రి చెప్పారు. ముఖ్యంగా 2014లో ప్రస్తుత శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసానాయకే పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజాస్వామిక శక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రత్యామ్నాయ రాజకీయాలకు బలమైన పునాది వేశారని వివరించారు. ఈ క్రమంలోనే 2019లో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమిని ఏర్పాటు చేసి, సంప్రదాయ రాజకీయ శక్తులకు ప్రత్యామ్నాయంగా సాధారణ ప్రజల చేతుల్లోకి అధికారాన్ని తీసుకురావడమే లక్ష్యంగా ఉద్యమాన్ని విస్తరించినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో "వ్యవస్థ మార్పు -- అవినీతి రహిత శ్రీలంక" అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లామని, రాజకీయ విలాసాలను తగ్గించి ప్రజాధనాన్ని పరిరక్షిస్తామని ఇచ్చిన హామీలకు మధ్యతరగతి, యువత విశేషంగా మద్దతు తెలిపారని మంత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, పారదర్శక పాలనకు ఇచ్చిన హామీలే ఎన్‌పీపీ విజయానికి ప్రధాన కారణాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భేటీలో సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, మల్లేపల్లి లక్ష్మయ్య, తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై యువత తిరుగుబాటు

**చిలుకూరులో ఘనంగా ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా 3వ మహాసభలు**

చిలుకూరు, జూలై 19




కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమై యువత భవిష్యత్తుతో చెలగాట మాడుతోందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం చిలుకూరులోని కస్తూరి అప్పారావు హాల్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ సూర్యపేట జిల్లా 3వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహాసభలకు ముందు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహిస్తూ విద్య, వైద్యం, ఉపాధి హక్కులు కల్పించాలని, మార్క్సిజం--లెనినిజం సిద్ధాంతం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్, గిగ్ ఎకానమీ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగాలు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే పాలకులు ప్రచారాలకే పరిమితమయ్యారని విమర్శించారు. నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రభుత్వ విద్యా--వైద్య రంగాల నిర్వీర్యం, కార్మిక హక్కుల హరణ వంటి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సూర్యపేట జిల్లాలో పరిశ్రమల కొరత, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం, యువత వలసలు, రైతు కుటుంబాల ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ కళాశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతుల లేమి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, ప్రైవేట్ విద్యా--వైద్య రంగాల దోపిడీ యువత జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాలు అడిగితే నిర్బంధం, హక్కులు కోరితే కేసులు, ప్రశ్నిస్తే అరెస్టులు అనే ధోరణిని తీవ్రంగా ఖండించారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేసి రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉద్యమాలకు కొత్త దిశ నిర్దేశిస్తామని తెలిపారు. శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాలతో శాశ్వత ఉద్యోగాలు, గిగ్ వర్కర్లకు కార్మిక హక్కులు, ప్రభుత్వ విద్యా--వైద్య రంగాల బలోపేతం, సామాజిక న్యాయం కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీపీఐ సూర్యపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకునే సైద్ధాంతిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై యువతను చైతన్యవంతం చేస్తూ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ్ల ధనుంజయ నాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగరాజు, సైదులు, వీరన్న, శ్రీను, సీపీఐ నాయకులు బద్దం కృష్ణారెడ్డి, షేక్ సాహెబ్ అలీ, మండవ వెంకటేశ్వర్లు, ఎస్కే లతీఫ్, గుండు వెంకటేశ్వర్లు, బత్తిని హనుమంతరావు, ప్రజా సంఘాల నాయకులు పిల్లుట్ల కనకయ్య, రేమిడల రాజు, చిలువేరు ఆంజనేయులు తదితరులతో పాటు వివిధ మండలాల నుంచి సుమారు 100 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ

చివ్వెంల, జూలై 19




సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నరసింహ (ఐపీఎస్) ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. స్టేషన్‌లో గ్రామాల వారీ రికార్డులు, కేసుల నమోదు ప్రక్రియ, దర్యాప్తు స్థితి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని పరిశీలించిన ఎస్పీ, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పారదర్శకమైన, ప్రజలకు చేరువైన పోలీసింగ్ అందించాలని సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాల బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోగొట్టుకున్న నగదును సాధ్యమైనంత త్వరగా తిరిగి పొందేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి అండగా లవాలని సూచించారు. చివ్వెంల మండలం మీదుగా జాతీయ రహదారి--65 వెళ్లే నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ తెలిపారు. అలాగే మండల పరిధిలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత నేరస్థులు, నేరాలకు పాల్పడే అనుమానితులను చట్టప్రకారం బైండోవర్ చేయాలని సూచించారు.

ఈ ఆకస్మిక తనిఖీలో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేష్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సైలు అందించిన ఆపన్నహస్తం

చిలుకూరు, జూలై 19




మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా 2014 ఎస్సై కోచింగ్ బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు తమ సహచరుడు, చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన ఎస్సై గుండెపంగు వెంకటనారాయణ కుటుంబానికి ఆపన్నహస్తం అందించారు. ఇటీవల వెంకటనారాయణ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించిన బ్యాచ్‌కు చెందిన దాదాపు 40 మంది ఎస్సైలు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.25 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం వెంకటనారాయణ కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల చెక్కును అందజేసి, కష్టకాలంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 2014 ఎస్సై బ్యాచ్ అధ్యక్షుడు, బేగంపేట ఎస్సై శ్రీధర్, ఎస్సైలు రామకృష్ణ, అశోక్ రెడ్డి, చిలుకూరు ఎస్సై మోహన్‌బాబు, హుజూర్‌నగర్, గరిడేపల్లి, మఠంపల్లి తదితర మండలాలకు చెందిన ఎస్సైలు పాల్గొన్నారు. తోటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన ఎస్సైల ఈ ఆపన్నహస్తం మానవత్వానికి, స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచి పలువురి ప్రశంసలను అందుకుంటోంది.

# హైదరాబాద్‌లో అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్

**జూలై 23 నుంచి 30 వరకు పోటీలు.. 1,600 మంది క్రీడాకారుల పోటీ**


హైదరాబాద్, జూలై 20




కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో అఖిల భారత పోలీసు క్రీడల నియంత్రణ మండలి (ఏఐపీసీసీ) నిర్వహిస్తున్న 11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్--2026 ఈ నెల 23 నుంచి 30 వరకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయి. దేశవ్యాప్తంగా 36 రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) నుంచి 1,600 మందికిపైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. జూడో, వుషు, తైక్వాండో, కరాటే, పెన్‌కాక్ సిలాట్ అనే ఐదు యుద్ధక్రీడల్లో వారు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (నీసా)లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్/ఐజీ హర్‌ప్రీత్ కౌర్ సోహి మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఈ ఛాంపియన్‌షిప్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఒలింపియన్ పారుపల్లి కశ్యప్, రోయింగ్ కోచ్ ఇస్మాయిల్ బేగ్ మాట్లాడుతూ, క్రీడలు పోలీసు సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న ఆసియా క్రీడలు--2026 దృష్ట్యా జూడో, వుషు, తైక్వాండో, కరాటే వంటి పతకాల అవకాశాలున్న క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించేందుకు ఈ ఛాంపియన్‌షిప్ ఉపయోగపడనుంది. పోటీల కోసం రూపొందించిన "వీరా మస్కట్ తెలంగాణ రాష్ట్ర జంతువైన చుక్కల జింక (చీతల్) స్ఫూర్తితో రూపొందించారు. "వైబ్రెంట్, ఇంపాక్ట్‌ఫుల్, రెసిలియెంట్, అజైల్" లక్షణాలకు ప్రతీకగా దీనిని ఆవిష్కరించారు. ఈ పోటీల నిర్వహణకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ పోలీసు అకాడమీ, అఖిల భారత పోలీసు క్రీడల నియంత్రణ మండలి ), జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ సహకారం అందిస్తున్నాయి.

# మరణించిన ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి రూ.90.85 లక్షల ఆర్థిక సాయం

**హైదరాబాద్, జూలై 20**




తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా నర్సంపేట డిపోకు చెందిన దివంగత ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ కుటుంబానికి రూ. 90,85, 500 విలువైన చెక్కును రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం అందజేశారు. ఆర్టీసీ కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్ భార్య హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినికి మంత్రి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సహోద్యోగి కుటుంబానికి అండగా నిలిచేందుకు ఆర్టీసీ ఉద్యోగులు ఏకమై చూపిన సహకారం అభినందనీయమని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా టీజీఎస్ఆర్టీసీకి రూ.300 కోట్లు విడుదల చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆర్టీసీని మరింత బలోపేతం చేయడం, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, ఉద్యోగుల సంక్షేమాన్ని పెంపొం దించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ సేవలను ఎంఎంటీఎస్, మెట్రో రైలు వ్యవస్థలతో అనుసంధానం చేయడంతో పాటు గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే క్యూర్ (జఖ=జు) ప్రాంతంలో ఆధునిక బస్ టెర్మినల్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలలోపు ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులని మంత్రి తెలిపారు. ఆర్టీసీ విలీన ప్రక్రియను ఎన్నికల అనంతరం మంత్రులు, అధికారుల నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన వెల్లడించారు.



# ప్రతి పాఠశాలకు గ్రంథపాలకుడి పోస్టు మంజూరు చేయాలి

**సూర్యాపేట, జూలై 20**

పాఠశాలల్లో గ్రంథాలయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి పాఠశాలలో గ్రంథపాలకుడి పోస్టును మంజూరు చేయాలని పిల్లలమర్రి పినవీరభద్ర కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగు ఉపాధ్యాయులు శీల అవిలేను ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులు చదవడం, రాయడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి పఠన సామర్థ్యాన్ని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా పుస్తకాలతో స్నేహం చేయాలంటే ప్రతి పాఠశాలలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేయడంతో పాటు, దానికి ప్రత్యేక గది, శిక్షణ పొందిన గ్రంథపాలకుడు ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం గురుకుల పాఠశాలల్లో గ్రంథపాలకుల పోస్టులు ఉన్నాయని, అదే విధానాన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలకు కూడా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యం, సృజనాత్మకత పెంపొందుతాయని, అభ్యసన సమస్యల పరిష్కారంలో కూడా గ్రంథాలయాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాలలో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసి, గ్రంథపాలకుల పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సూర్యాపేటకు రైల్వే లైన్ కోసం పదివేల సంతకాల ఉద్యమం

**జూలై 24న వాణిజ్య భవన్ సెంటర్‌లో మహా సంతకాల సేకరణ**

**సూర్యాపేట, జూలై 20**

సూర్యాపేటకు తక్షణమే రైల్వే లైన్ మంజూరు చేయాలనే డిమాండ్‌తో సూర్యాపేట రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో భారీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి ప్రకటించింది. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసి సూర్యాపేట రైల్వే హక్కు కోసం బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపింది. సమితి విడుదల చేసిన ప్రకటనలో, సూర్యాపేట తెలంగాణలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పట్టణాలలో ఒకటని, నిజాం కాలం నుంచే తాలూకా కేంద్రంగా అభివృద్ధి చెందిన ఈ పట్టణం ప్రస్తుతం తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రధాన వాణిజ్య, విద్య, వైద్య, రవాణా కేంద్రంగా ఎదిగిందని పేర్కొంది.

**ఇంతటి చరిత్ర, జనాభా, అభివృద్ధి ఉన్నప్పటికీ ఇప్పటికీ రైల్వే లైన్ లేకపోవడం జిల్లాకు జరుగుతున్న తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. పొరుగు జిల్లాల్లోని భువనగిరి, నల్లగొండ, మిర్యాలగూడ వంటి పట్టణాలకు రైల్వే సౌకర్యం ఉన్నప్పటికీ లక్షలాది ప్రజలకు సేవలందిస్తున్న సూర్యాపేటను రైల్వే మ్యాప్‌కు దూరంగా ఉంచడం సమంజసం కాదని పేర్కొంది. గతంలో సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్, డోర్నకల్--కర్నూలు రైల్వే మార్గం ప్రతిపాదనలు వచ్చినప్పటికీ అనంతరం ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా మార్గాన్ని మార్చడం ప్రజల ఆశలను దెబ్బతీసిందని తెలిపింది.**

ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, వృత్తి సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, మేధావులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సమితి పిలుపునిచ్చింది. ఈ నెల 24న నిర్వహించే కార్యక్రమంలో 10 వేల మంది ప్రజల సంతకాలను సేకరించి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి మహజరు సమర్పించనున్నట్లు తెలిపింది. ప్రతి సంతకం సూర్యాపేట ప్రజల ఆకాంక్షకు ప్రతీకగా నిలుస్తుందని, ఇది కేవలం సంతకాల కార్యక్రమం మాత్రమే కాకుండా సూర్యాపేట రైల్వే హక్కు కోసం ప్రారంభమవుతున్న ప్రజా ఉద్యమమని పేర్కొంది. సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని, ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో పాల్గొని తన సంతకం ద్వారా ఉద్యమానికి బలం చేకూర్చాలని సూర్యాపేట రైల్వే సాధన సమితి విజ్ఞప్తి చేసింది.

# షైనింగ్ స్టార్.. ప్రతిభకు పట్టం!

**జిల్లాలో 175 మందికి షైనింగ్ స్టార్స్ పురస్కారాలు**

**మెరిసిన విద్యాతారలు.. స్వర్ణాంధ్రకు వారధులు**

**వికసిత్ భారత్ సాకారానికి కీలక భాగస్వాములు**

**ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆదర్శవంతులుగా ఎదగాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ పురస్కారాలతో ప్రతిభకు పట్టంకడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని.. ఈ చేయూతతో భవిష్యత్తులో దేశానికి ఆదర్శవంతులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

పాఠశాల విద్య, సమగ్రశిక్ష, ఇంటర్మీడియెట్ విద్యాశాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో షైనింగ్ స్టార్స్ ప్రతిభా పురస్కారాలు–2026 కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామమోహన్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఏపీ కుమ్మరి, శాలివాహన సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.ఎస్.బేగ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 135 మందితో పాటు ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో 40 మంది విద్యార్థులకు రూ. 20 వేల నగదు బహుమతితో పాటు పతకం, సర్టిఫికెట్ అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తాను ఐదో తరగతి చదువుతున్నప్పుడు మంచి మార్కులు సాధించినందుకు బహుమతిగా ఒక డిక్షనరీ అందుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఆ డిక్షనరీని తన తల్లికి చూపించినప్పుడు ఆమె ముఖంలో కనిపించిన ఆనందం తన జీవితాంతం మరచిపోలేని జ్ఞాపకంగా నిలిచిపోయిందన్నారు. ఆ ఆనందాన్ని ఎప్పటికీ నిలబెట్టాలనే సంకల్పమే తనను ఐఏఎస్‌గా తీర్చిదిద్దిందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహంతో మరింత మంది షైనింగ్ స్టార్‌లుగా ఎదగాలని.. దీర్ఘకాలంలో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇంత మంచి అవకాశం కల్పిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులకు విద్యార్థుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సభాధ్యక్షులు, శాసనసభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూలి షైనింగ్ స్టార్స్ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని.. విద్యతోనే ఒక కుటుంబం దశ, దిశ మారుతుందని, అందుకే గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులు విద్యారంగం అభివృద్ధికి విశేష కృషిచేస్తున్నారన్నారు. గౌరవ సీఎం మొదట్నుంచీ మహిళా శక్తి సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, నేటి షైనింగ్ స్టార్స్‌లో ఎక్కువమంది అమ్మాయిలే ఉండటం ఆ కృషి ఫలితమేనని పేర్కొన్నారు. యువశక్తి దేశాభివృద్ధికి ప్రధానమని, యువత చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని శాసనసభ్యులు సూచించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ..లి దేశాన్ని 2047 నాటికి విశ్వగురుగా మార్చేందుకు గౌరవ ప్రధానమంత్రి, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ముందంజలో నిలపడానికి స్వర్ణాంధ్ర రూపకల్పనకు గౌరవ సీఎం కృషిచేస్తున్నారన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి అత్యుత్తమ మానవ వనరులు కీలకమని.. అందుకే నూతన జాతీయ విద్యావిధానం తెచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల ద్వారా అత్యుత్తమ విద్యను అందించేందుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ షైనింగ్ స్టార్స్ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏపీ కుమ్మరి, శాలివాహన సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.ఎస్.బేగ్.. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని.. ఇంతటితో ఆగకుండా ఈ విజయం స్ఫూర్తితో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాకారానికి కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకరరావు, సమగ్రశిక్ష ఏపీసీ ఆర్.రమేష్‌బాబు, మారిస్ స్టెల్లా కళాశాల నుంచి డా. సిస్టర్ ఇన్నాసమ్మ, జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది సూరిబాబు, జీవీ రమణ, షేక్ ఉమర్ అలీ, కె.పిచ్చేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, అశోక్‌బాబు, ఏవీవీ ప్రసాదబాబు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 'మన అమ్మ జ్ఞాపకాలు' కావ్యావిష్కరణ ఘనంగా

**సూర్యాపేట, జూలై 19**



భానుపురి సాహితీ వేదిక వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి లింగాల కవితా శ్రీనివాస్ రచించిన 'మన అమ్మ జ్ఞాపకాలు' కావ్యాన్ని ఆదివారం పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ వీపూరి సుదర్శన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ, తల్లి ప్రేమ, త్యాగం, మమకారం వంటి శాశ్వత మానవీయ విలువలను సాహిత్యం ద్వారా తరతరాలకు అందించడం ప్రతి రచయిత బాధ్యత అని అన్నారు. అలాంటి భావోద్వేగాలను హృదయాన్ని హత్తుకునేలా ప్రతిబింబించిన 'మన అమ్మ జ్ఞాపకాలు' కావ్యం పాఠకులను ఆలోచింపజేసే విలువైన రచనగా నిలుస్తుందని కొనియాడారు. కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ తెలుగు శాఖాధ్యక్షులు పంతంగి వెంకటేశ్వర్లు కావ్యాన్ని ఆవిష్కరించగా, తొలి ప్రతిని మాగి గురవయ్య స్వీకరించారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ, అమ్మ లేకుంటే మన ఉనికే లేదని, అమ్మ రుణాన్ని ఎప్పటికీ తీర్చలేమని అన్నారు. కవి, ఉపాధ్యాయులు గడ్డం కృష్ణారెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తూ, తల్లి గొప్పతనం, కుటుంబ అనుబంధాలు, జీవిత విలువలను రచయిత హృద్యంగా విష్కరించారని ప్రశంసించారు. అనంతరం పలువురు సాహితీవేత్తలు, కవులు మాట్లాడుతూ లింగాల కవితా శ్రీనివాస్ రచనలో తల్లి గొప్పతనం, మాతృమూర్తి పట్ల అనురాగం, కుటుంబ బంధాలు, మానవీయ విలువలు హృదయానికి హత్తుకునేలా ప్రతిఫలించాయని అభినందించారు. భానుపురి సాహితీ వేదిక అధ్యక్షులు సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో దుబ్బాకుల కృష్ణస్వామి, భానుపురి సాహితీ వేదిక సభ్యులు, కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని రచయిత లింగాల

## రిటైర్మెంట్ రూమర్స్‌పై రోహిత్ క్లారిటీ




### నా పని మైదానంలోనే!

**లండన్, జులై 21**

భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు మరోసారి స్పష్టత ఇచ్చాడు. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగిన చివరి వన్డే అనంతరం బీసీసీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించిన రోహిత్, తన దృష్టి పూర్తిగా జట్టు కోసం అత్యుత్తమ ప్రదర్శన చేయడంపైనే ఉందని స్పష్టం చేశాడు.

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు వన్డేల్లో రోహిత్ శర్మ వరుసగా 11, 26 పరుగులకే పరిమితమవడంతో 2027 వన్డే ప్రపంచకప్‌కు సంబంధించిన భారత జట్టు ప్రణాళికల్లో ఆయన స్థానంపై చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన రోహిత్, తాను అరంగేట్రం చేసినప్పటి నుంచే ఇలాంటి చర్చలు జరుగుతున్నాయని, తాను ఆడినంతకాలం అవి కొనసాగుతూనే ఉంటాయని పేర్కొన్నాడు. "బ్యాట్‌తో రాణించడం, దేశం తరపున ఆడటం నా పని. మైదానంలో నేను ఏం చేస్తానన్నదే ముఖ్యం. జట్టుకు నా వంతు సహకారం అందించడమే నా ప్రధాన లక్ష్యం. రూమర్స్ జరగనివ్వండి.. అవి లేకపోతే మజా ఉండదు. నా పని మైదానం లోపల ఉంటుంది. విమర్శించే వారి పని బయట ఉంటుంది. కామెంటరీ బాక్స్‌లో కూర్చున్న వాళ్లు గానీ, చేతిలో ల్యాప్‌టాప్‌తో రాసేవాళ్లు గానీ నా జీవితాన్ని నిర్ణయించలేరు" అని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఇదిలా ఉండగా, లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డే తర్వాత రోహిత్ శర్మ రిటైర్ అవుతారన్న వార్తలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇప్పటికే ఖండించారు. జట్టు ప్రణాళికల్లో రోహిత్ కీలక భాగమేనని, ఆయన తక్షణ భవిష్యత్తుపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యశస్వి జైస్వాల్ వంటి యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించనున్నారన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం భారత జట్టు ప్రణాళికల్లో రోహిత్ శర్మ కీలక సభ్యుడిగానే కొనసాగుతున్నారని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



# స్పెయిన్‌కు ప్రపంచకప్

**న్యూయార్క్, జులై 21**

ఫిఫా ప్రపంచకప్--2026లో స్పెయిన్ విశ్వవిజేతగా నిలిచింది. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను అదనపు సమయంలో 1-0 తేడాతో ఓడించి రెండోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. నిర్ణీత 90 నిమిషాల ఆటలో ఇరు జట్లు గోల్ చేయలేకపోవడంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయం రెండో భాగం ప్రారంభమైన కేవలం 37 సెకన్లకే ఫెర్రాన్ టోర్రెస్ చేసిన గోల్ స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. మ్యాచ్ ఆరంభం నుంచే స్పెయిన్ బంతిపై ఆధిపత్యం చెలాయించింది. రెండ్షోర్థం అదనపు సమయంలో అర్జెంటీనా ఆటగాడు ఎంజో ఫెర్నాండెజ్ ఎర్ర కార్డు కారణంగా మైదానాన్ని వీడటంతో ఆ జట్టు చివరి వరకు పది మంది ఆటగాళ్లతోనే పోరాడాల్సి వచ్చింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న స్పెయిన్ ఆటగాళ్లు వరుస దాడులతో అర్జెంటీనా రక్షణను ఒత్తిడిలోకి నెట్టారు. పెడ్రో పోర్రో అందించిన అద్భుతమైన క్రాస్‌ను నికో విలియమ్స్ తలతో మళ్లించగా, సరైన సమయంలో ముందుకొచ్చిన ఫెర్రాన్ టోర్రెస్ ఎడమకాలితో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో ఫెర్రాన్ టోర్రెస్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. టోర్నీ ఆరంభంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదంటూ విమర్శలు ఎదుర్కొన్న అతడు, ఫైనల్లో మ్యాచ్ విజేతగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నాడు. తన ఆటతోనే విమర్శకులకు సమాధానం చెప్పాడు. ఫెర్రాన్ టోర్రెస్‌కు భారత్‌తోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. 2017లో భారత్‌లో జరిగిన ప్రపంచ అండర్-17 ఫుట్‌బాల్ టోర్నీలో స్పెయిన్ తరఫున ఆడి రెండు గోల్స్ నమోదు చేసి జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు.



## టికీ-టాకా 2.0తో స్పెయిన్ జైత్రయాత్ర

**న్యూయార్క్, జులై 21**

ప్రపంచ ఫుట్‌బాల్‌లో కొన్ని జట్లు ట్రోఫీలను మాత్రమే గెలుస్తాయి. మరికొన్ని జట్లు ఆట తీరునే మార్చేస్తాయి. అలాంటి జట్లలో స్పెయిన్ ఒకటి. 2010 ప్రపంచకప్‌లో బంతిపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన 'టికీ-టాకా' వ్యూహంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన స్పెయిన్, ఇప్పుడు అదే శైలికి ఆధునిక రూపం ఇచ్చిన 'టికీ-టాకా 2.0'తో మరోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. పాత వ్యూహంలోని బంతి నియంత్రణను కొనసాగిస్తూనే వేగం, దూకుడు, నేరుగా దాడి చేసే తత్వాన్ని జోడించి ఆధునిక ఫుట్‌బాల్‌కు తగ్గట్టుగా తన ఆటతీరును మార్చుకుంది. టికీ-టాకా వ్యూహం అంటే బంతిని ఎక్కువసేపు తమ అధీనంలో ఉంచుకోవడం, వరుస చిన్న చిన్న పాస్‌లతో ప్రత్యర్థిని అలసటకు గురిచే యడం, ఖాళీ ప్రదేశాలను సృష్టించి సరైన సమయంలో గోల్ అవకాశాన్ని అందిపుచ్చు కోవడం. ప్రత్యర్థికి బంతి దక్కకుండా చేయడమే ఈ వ్యూహం ప్రధాన లక్ష్యం. దక్షిణాఫ్రికాలో జరిగిన 2010 ప్రపంచక ప్‌లో స్పెయిన్ ఇదే శైలితో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఆ టోర్నీలో కేవలం ఎనిమిది గోల్స్ చేసినప్పటికీ ప్రతి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి 2008 యూరో నుంచి 2012 యూరో వరకు అంతర్జాతీయ ఫుట్‌బాల్‌ను శాసించి ంది. కాలానుగుణంగా ఫుట్‌బాల్ వేగం పెరగడంతో ప్రత్యర్థి జట్లు కూడా టికీ-టాకాకు ఎదురుదాడి చేసే వ్యూహాలను సిద్ధం చేసుకున్నాయి. 2014 ప్రపంచక ప్‌లో స్పెయిన్ ఘోరంగా విఫలమవగా, 2022 ప్రపంచకప్‌లోనూ పాత శైలిని కొనసాగించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు.

## రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై కెప్టెన్ గిల్ క్లారిటీ

**న్యూఢిల్లీ, జులై 21**

టీమిండియా సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఖండించాడు. జట్టులో రోహిత్ రిటైర్మెంట్‌కు సంబంధించి ఎలాంటి చర్చలు జరగలేదని, ప్రచారంలో ఉన్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశాడు. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డే అనంతరం రోహిత్ తన 19 ఏళ్ల వన్డే కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నారనే వార్తలు వైరల్‌గా మారాయి. ఈ ఊహాగానాలపై మ్యాచ్ అనంతరం స్పందించిన గిల్, రోహిత్ భవిష్యత్తుపై జట్టు యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం అలాంటి చర్చే లేదని వెల్లడించాడు. ఒకవైపు రిటైర్మెంట్ వార్తలు వినిపిస్తుండగా, మరోవైపు రోహిత్ శర్మ తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో 110 బంతుల్లో 17 ఫోర్లు, ఐదు సిక్సర్లతో 138 పరుగులు చేసి అద్భుత శతకం నమోదు చేశాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌కు శుభారంభం అందించాడు. అయితే 387 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ, నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉండి రోహిత్ ఇన్నింగ్స్‌ను చూడటం ప్రత్యేక అనుభూతిగా అనిపించిందని తెలిపాడు. ప్రారంభంలో ఓపికగా ఆడి, ఆ తర్వాత ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన తీరు అసాధారణమని ప్రశంసించాడు. అతని అనుభవం, ఆటతీరు జట్టుకు ఎంతో కీలకమని పేర్కొన్నాడు. వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు ముందు రోహిత్ శర్మకు రాబోయే వన్డే సిరీస్‌లు కీలకంగా మారనున్నాయి.









## మహిళల టెన్నిస్‌లో కీలక మార్పు

**లండన్, జులై 21**

మహిళల టెన్నిస్‌లో కీలక మార్పులకు మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) శ్రీకారం చుట్టింది. ఇకపై మహిళల టోర్నీల్లో పాల్గొనే క్రీడాకారిణులకు జన్యు పరీక్షలను తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలను ప్రకటించింది. లింగ నిర్ధారణ కోసం ఎస్ఆర్‌వై (ఎస్ఆర్‌వై) జన్యు పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలు జులై 21 నుంచి అమల్లోకి రానున్నాయి. డబ్ల్యూటీఏ ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారం, ప్రతి క్రీడాకారిణి తన కెరీర్‌లో ఒక్కసారి మాత్రమే ఎస్ఆర్‌వై జన్యు పరీక్ష చేయించుకోవాలి. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికే మహిళల విభాగంలో పోటీపడేందుకు అనుమతి ఉంటుంది. ఈ పరీక్ష కోసం క్రీడాకారిణుల చెంప లోపలి భాగం నుంచి తీసిన నమూనా లేదా రక్త నమూనాను ఉపయోగించి ఎస్ఆర్‌వై జన్యువు ఉనికిని పరిశీలిస్తారు. గతంలో మాదిరిగా ట్రాన్స్‌జెండర్ క్రీడాకారులు మహిళల విభాగంలో పోటీ చేసే అవకాశంపై ఈ కొత్త విధానం ప్రభావం చూపనుంది. ఈ నిర్ణయంపై డబ్ల్యూటీఏ స్పందిస్తూ, మహిళల టోర్నీల్లో పోటీ చేసే క్రీడాకారిణుల అర్హతను నిర్ధారించేందుకు మాత్రమే ఈ పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపింది. అత్యంత గోప్యత, అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ ఈ ప్రక్రియను నిర్వహిస్తామని, ఇది సున్నితమైన అంశం కావడంతో ప్రతి ఒక్కరి గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరిస్తామని పేర్కొంది. అంతర్జాతీయంగా ఇతర క్రీడా సమాఖ్యలు కూడా మహిళల విభాగంలో పోటీపడే అథ్లెట్లకు జన్యు పరీక్షలను అమలు చేస్తున్న నేపథ్యంలో తాము కూడా ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు డబ్ల్యూటీఏ స్పష్టం చేసింది. మహిళల అథ్లెటిక్స్‌లో కూడా ఇటువంటి అర్హత నిబంధనలు ఇప్పటికే అమల్లో ఉన్నాయని గుర్తు చేసింది.

# వందకోట్లు ఇచ్చినా మళ్లీ సోషల్ మీడియా జోలికి వెళ్లను

**రోజుకు వందకోట్లు ఇచ్చినా సరే, మళ్లీ సోషల్ మీడియా జోలికి మాత్రం వెళ్లను" అని ఐశ్వర్య లక్ష్మి స్పష్టం చేశారు. తన తాజా చిత్రం 'గట్టాకుస్తీ 2' గురించి మాట్లాడుతూ.. ఈ సినిమా మంచి విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు.**

హైదరాబాద్, జూలై 21

సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల ప్రాణం హాయిగా ఉందని కేరళ సోయగం ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె తన చిత్రాల గురించి, అంతర్జాల వేదికల (సోషల్ మీడియా) గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. "ఒకప్పుడు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండేదాన్ని. కానీ నా ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన వ్యాఖ్యలు (కామెంట్లు) పెట్టి కొందరు నన్ను బాధపెట్టారు. వారి ప్రవర్తన వల్ల ప్రపంచమంతా నన్ను ద్వేషిస్తున్నట్లు అనిపించేది. ఇప్పుడు ఆ వేదికలకు దూరంగా, ప్రేక్షకులకు దగ్గరగా ఉంటున్నాను. రోజుకు వందకోట్లు ఇచ్చినా సరే, మళ్లీ సోషల్ మీడియా జోలికి మాత్రం వెళ్లను" అని ఐశ్వర్య లక్ష్మి స్పష్టం చేశారు. తన తాజా చిత్రం 'గట్టాకుస్తీ 2' గురించి మాట్లాడుతూ.. ఈ సినిమా మంచి విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించే కథాంశం కావడం వల్లే ఇది తన మనసుకు ఎంతో దగ్గరైందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఒక మహిళా ప్రధాన చిత్రంలో పోలీసు అధికారిణిగా నటిస్తున్న ఐశ్వర్య లక్ష్మి చేతిలో 'తీవియన్ పొట్టు', 'లవ్' అనే వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. త్వరలోనే ఈ అందాలభామ తెలుగు ప్రేక్షకులను కూడా పలకరించనుందని చిత్ర పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి



# అల్లు అర్జున్ 'రాకా'లో సిరి హన్మంతు

**చిత్రబృందం ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తుండగా, మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులతో భారీ బడ్జెట్‌లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో పాటు హాలీవుడ్ స్థాయి యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.**



హైదరాబాద్, జులై 21

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా'పై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ అంశాలతో అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో తెలుగు నటి సిరి హన్మంతు కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడైంది. ఇటీవల నిర్వహించిన ఓ సినీ కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని ప్రకటించారు. దీంతో 'రాకా' చిత్రంలో సిరి హన్మంతు ఎలాంటి పాత్రలో కనిపించబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. చిత్రబృందం ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తుండగా, మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులతో భారీ బడ్జెట్‌లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో పాటు హాలీవుడ్ స్థాయి యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. తెలుగు ప్రేక్షకులకు పరిచయ మైన సిరి హన్మంతు ఇటీవల 'సీతాపయనంలో' చిత్రంలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. త్వరలో విడుదల కానున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్రలో కనిపించనుంది. ఇప్పుడు అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోతో 'రాకా' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రంలో అవకాశం దక్కడం ఆమె సినీ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ప్రస్తుతం 'రాకా' చిత్రీకరణ ముంబైలో శరవేగంగా సాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత దర్శకుడు సాయి అభ్యాంకర్ స్వరాలు సమకూరుస్తుండగా, ప్రపంచవ్యాప్తంగా 2027 చివర్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అల్లు అర్జున్--అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం కావడంతో దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఈ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'కమిటీ కుర్రోళ్ళు' జాతీయ అవార్డులపై భావోద్వేగానికి గురైన నిహారిక



హైదరాబాద్, జులై 21

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా రూపొందిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రం ప్రతిష్ఠాత్మక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు గెలుచుకోవడంతో చిత్రబృందం ఆనందంలో మునిగిపోయింది. గ్రామీణ నేపథ్యంతో, కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సక్సెస్ మీట్‌లో నిర్మాత నిహారిక కొణిదెల, దర్శకుడు యదు వంశీ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిహారిక కొణిదెల తమ కుటుంబానికి జాతీయ అవార్డులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సరిగ్గా 36 ఏళ్ల క్రితం తన తండ్రి నాగబాబు నిర్మాతగా నిర్మించిన తొలి చిత్రం 'రుద్రవీణ' మూడు జాతీయ అవార్డులు అందుకుందని, ఇప్పుడు తాను పూర్తి బాధ్యతతో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' కూడా రెండు జాతీయ అవార్డులు గెలుచుకోవడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. తమ కుటుంబ సినీ ప్రయాణంలో ఇది మరో మధురమైన ఘట్టమని పేర్కొన్నారు. జాతీయ అవార్డు లక్ష్యంగా ఈ సినిమాను నిర్మించలేదని, దర్శకుడు యదు వంశీ చెప్పిన కథ విన్న తర్వాత మాత్రం ఈ సినిమాకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలనే బలమైన నమ్మకం కలిగిందని నిహారిక వెల్లడించారు. ఇప్పుడు ఆ ఆశ నిజం కావడం ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ విజయంపై మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారని, ఆయన ప్రశంసలు తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయని తెలిపారు. దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ, ఈ కథపై మొదటి నుంచే పూర్తి విశ్వాసం ఉందని, సినిమా చిత్రీకరణ ప్రారంభమైనప్పుడే జాతీయ అవార్డు సాధించే సత్తా దీనికి ఉందని భావించానన్నారు. ఇప్పుడు ఆ నమ్మకం నిజమవడం జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిందని చెప్పారు.

# సెప్టెంబరులో బిగ్‌బాస్ కొత్త సీజన్ల సందడి

## ఆరు భాషల్లో ఒకేసారి ప్రారంభం

ముంబై, జులై 21

రియాలిటీ షోల అభిమానులకు జియోస్టార్ సంస్థ శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా అత్యధిక ప్రేక్షకాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్‌బాస్' కొత్త సీజన్లు సెప్టెంబరు నెల నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో ఒకేసారి కొత్త సీజన్లు ప్రారంభం కానుండటంతో ఈసారి బిగ్‌బాస్ వినోదం మరింత వైభవంగా ఉండనుంది. ఒకే సమయంలో ఆరు ప్రధాన భారతీయ భాషల్లో షో ప్రారంభం కావడం బిగ్‌బాస్ చరిత్రలోనే అతిపెద్ద మైలురాయిగా భావిస్తున్నారు. ఈసారి కూడా ప్రతి భాషలో ప్రముఖ సెలబ్రిటీలు హోస్టులుగా ప్రేక్షకులను అలరించనున్నారు. హిందీ బిగ్‌బాస్‌కు బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా కొనసాగుతుండగా, తెలుగు వెర్షన్‌కు కింగ్ నాగార్జున మరోసారి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. కన్నడలో కిచ్చా సుదీప్, మలయాళంలో మోహన్‌లాల్ తమ ప్రత్యేక శైలిలో షోను ముందుకు నడిపించనున్నారు. తమిళ బిగ్‌బాస్‌కు విజయ్ సేతుపతి హోస్ట్‌గా కొనసాగుతుండగా, బెంగాలీ వెర్షన్‌కు భారత మాజీ క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. ఈ స్టార్ హోస్టుల లైనప్‌తో అన్ని భాషల బిగ్‌బాస్ సీజన్లపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గత రెండు దశాబ్దాలుగా బిగ్‌బాస్ ప్రతి సీజన్‌తో ప్రేక్షకాదరణను మరింత పెంచుకుంటూ వస్తోందని జియోస్టార్ ప్రతినిధులు తెలిపారు. వినోదంతో పాటు సామాజిక చర్చలకు వేదికగా నిలుస్తూ ఈ షో భారతీయ టెలివిజన్ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. అనేక మంది కొత్త ప్రతిభావంతులను ప్రేక్షకులకు పరిచయం చేయడంతో పాటు బ్రాండ్‌లకు విస్తృత ప్రచార వేదికగా బిగ్‌బాస్ నిలిచిందని వివరించారు. బిగ్‌బాస్ సాధించిన విజయాలు, సాంస్కృతిక ప్రభావం, ప్రేక్షకాదరణను ప్రతిబింబించేలా 'ఇండియాస్ బిగ్ రియాలిటీ' పేరుతో ప్రత్యేక కాఫీ టేబుల్ పుస్తకాన్ని జియోస్టార్ ఆవిష్కరించింది.




# వరుస భారీ చిత్రాలతో దూసుకెళ్తున్న మమితా బైజు



తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో అగ్ర హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ తక్కువ కాలంలోనే అత్యంత డిమాండ్ ఉన్న కథానాయికగా ఎదిగింది. వరుసగా విడుదలకు సిద్ధమవుతున్న ఆమె చిత్రాలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తమిళ నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కథానాయకుడిగా నటించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'జననాయగన్'లో మమితా బైజు కీలక పాత్ర పోషించింది. విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జులై 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంటుందనే విశ్వాసాన్ని చిత్రబృందం వ్యక్తం చేస్తోంది. ఇక తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలోనూ మమితా కథానాయికగా నటిస్తోంది. సూర్య హీరోగా, వెంకీ అట్లూరి దర్శకత్వంలో కుటుంబ భావోద్వేగాలు, ప్రేమకథ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానున్నట్లు సమాచారం.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467